# సాక్షి
## శ్రీసత్యసాయి జిల్లా
సోమవారం । 21 । అక్టోబర్ । 2024






**కరాటే శిక్షణ... స్వీయ రక్షణ**
అమ్మాయిలు స్వీయ రక్షణ కోసం కరాటేను ఎంచుకుంటున్నారు. యుద్ధవిద్య కరాటేలో మెలకువలు నేర్చుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. 8లో



**టమాట కిలో రూ.45**
అనంతపురం కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట గరిష్ట ధర రూ.45 పలికింది. కనిష్టం రూ.25, సరాసరి రూ.36 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
33.1°/22.3°
జిల్లా పరిధిలో ఆదివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి నుంచి తుంపర్లు పడ్డాయి. ఈశాన్యం దిశగా గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

## న్యూస్‌రీల్

### నేడు పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం



రిహార్సల్స్ చేస్తున్న పోలీసులు

పుట్టపర్తి టౌన్: విధి నిర్వహణలో అసువులు బాసి అమరులైన పోలీసులను గుర్తు చేసుకుంటూ సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎస్పీ రత్న తెలిపారు. ఉదయం 7.30 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమానికి కలెక్టర్ టీఎస్ చేతన్, జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, జిల్లా జడ్జి రాఖేష్‌తో పాటు ఎంపీ, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు హాజరై విధి నిర్వహణలో అమరులైన పోలీస్ అమరవీరులకు నివాళులర్పించనున్నారు. అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలో 22 నుంచి 30 వరకు పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాలు నిర్వహించనున్నారు. 31న సమైక్యతా దినంతో సంస్మరణ దినోత్సవాలు ముగుస్తాయి.

### నేడు కలెక్టరేట్‌లో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'



ప్రశాంతి నిలయం: కలెక్టరేట్‌లో సోమవారం 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' నిర్వహించనున్నట్లు కలెక్టర్ చేతన్ తెలిపారు. ప్రజలు తమ సమస్యలపై వినతిపత్రాల ద్వారా అధికారుల దృష్టికి తీసుకురావొచ్చని పేర్కొన్నారు.

### నేటి నుంచి సర్టిఫికెట్ల పరిశీలన



పుట్టపర్తి టౌన్: కేజీబీవీ (కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయా)ల్లో ఖాళీగా ఉన్న టీచింగ్ పోస్టులకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు సోమవారం ఉదయం 10 గంటల నుంచి 1:5 ప్రకారం సర్టిఫికెట్ల వెరిఫికేషన్ నిర్వహిస్తున్నట్లు డీఈఓ మీనాక్షి తెలిపారు. మెరిట్ లిస్ట్‌లో పేర్లు ఉన్న అభ్యర్థులకు వారి సెల్‌ఫోన్ ద్వారా సమాచారం పంపామని పేర్కొన్నారు. సదరు అభ్యర్థులు విద్యార్హత సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డు, కుల, ఆదాయ ధ్రువీకరణపత్రాలు ఒరిజనల్‌వి తీసుకొని బుక్కపట్నం సర్వశిక్ష అభియాన్ కార్యాలయానికి హాజరు కావాలని సూచించారు.

### శతాధిక వృద్ధురాలు మృతి



నాగమ్మ (ఫైల్)

ధర్మవరం అర్బన్: పట్టణంలోని గాండ్లవీధికి చెందిన శతాధిక వృద్ధురాలు సుంకర నాగమ్మ (106) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందింది. బంధుమిత్రులతో పాటు వార్డులోని ప్రజలు తరలివచ్చి నాగమ్మ మృతదేహానికి నివాళులర్పించారు. గత కొన్నాళ్ల క్రితం వరకు నాగమ్మ ఎంతో చలాకీగా ఉండేదని ఈ సందర్భంగా వారు గుర్తు చేసుకున్నారు. కుటుంబ సభ్యులు సుంకర నారాయణ, సుంకర పుల్లమ్మ, మనవళ్లు, మనవరాళ్లు సుంకర నరేష్, సతీష్, నారాయణ స్వామి, రమాదేవి, నాగేశ్వరి తదితరులు ఆమె అంత్యక్రియలు నిర్వహించారు.

# శాంతి భద్రత లేదు

ఒకప్పుడు ప్రశాంతతకు మారుపేరైన హిందూపురం నియోజకవర్గంలో నేడు అశాంతి వాతావరణం నెలకొంది. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక శాంతిభద్రతలు అదుపుతప్పాయి. రక్షించాల్సిన పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఏ క్షణంలో ఏం జరుగుతుందోనని ప్రజలు భయం భయంగా గడుపుతున్నారు. ఎమ్మెల్యే బాలకృష్ణ స్థానికంగా లేకపోవడంతో సమస్యల గురించి ఎవరికి చెప్పుకోవాలో తెలియక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

- 'పురం'లో గాడి తప్పిన పాలన
- భయం భయంగా గడుపుతున్న ప్రజలు
- రాష్ట్ర వ్యాప్తంగా కలకలం రేపిన గ్యాంగ్‌రేప్
- సంచలనం కలిగించిన మద్యం లాటరీదారుడి కిడ్నాప్
- నియోజకవర్గంపై దృష్టి పెట్టని ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ





గ్యాంగ్ రేప్ దోషులను శిక్షించాలని పోలీసులకు విన్నవిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు (ఫైల్), సీసీ టీవీ ఫుటేజీల్లో రికార్డయిన గ్యాంగ్ రేప్ దృశ్యం

సాక్షి, పుట్టపర్తి: నియోజకవర్గ అభివృద్ధి.. ప్రజా సమస్యల పరిష్కారం కోసం పాటుపడతానని ఎన్నికల్లో హామీ ఇచ్చిన నందమూరి బాలకృష్ణ గెలిచిన తర్వాత పత్తా లేకుండా పోయారు. సినిమా షూటింగ్‌ల్లో ఆయన బిజీ అయిపోయారు. ప్రజల బాగోగులను గాలికి వదిలేశారు. పీఏలను పెట్టి ఆయన సైడ్ అయిపోయారు. నియోజకవర్గంలో గ్యాంగ్ రేప్, కిడ్నాప్, దాడులు, రాజకీయ హత్యలు, బెదిరింపులు వంటివి పెరిగిపోతున్నా స్పందించడం లేదు. ఎప్పుడో ఓసారి వచ్చి ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో రిబ్బన్ కట్ చేసి ఫొటోలకు ఫోజులు ఇచ్చి వెళ్లిపోతున్నారు. ప్రజా సమస్యలపై ఏనాడూ అసెంబ్లీలో ప్రస్తావించిన దాఖలాలు లేవని ప్రజలు చెబుతున్నారు. నియోజకవర్గ కేంద్రంలో తాగునీటి సమస్య తీవ్రరూపం దాల్చినా పట్టనట్టు వ్యవహరిస్తున్నారని మండిపడుతున్నారు.

**ఆరంభంలోనే దాడి.. హత్య**

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జూలై 3వ తేదీన వైఎస్సార్‌సీపీ కార్యకర్త సతీశ్‌ను ఊరి బయటికి తీసుకెళ్లి దారుణంగా కొట్టారు. దీంతో కుటుంబ సభ్యులు బెంగళూరు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయాడు. ఎన్నికల సమయంలో వైఎస్సార్‌సీపీ తరఫున చురుగ్గా పనిచేశాడనే కారణంతో సతీశ్‌ను అంతమొందించినట్లు తెలిసింది.

**ఎంపీపీని ఊరు విడిపించారు**

చిలమత్తూరు మండల సర్వసభ్య సమావేశం జూలై 24న నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. అదే రోజు సమావేశంలో ఎంపీపీ పురుషోత్తంరెడ్డి లక్ష్యంగా టీడీపీ నేతలు భారీ కుట్ర చేశారు. అయితే ఇది కాస్తా ముందే బయటకు పొక్కడంతో పురుషోత్తంరెడ్డిని పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. ఆ తర్వాత ఊరు ఖాళీ చేయించారు. లేనిపక్షంలో లేనిపోని కేసులు నమోదు చేసి కటకటాల్లోకి పంపాల్సి ఉంటుందని పోలీసులు ఇంటికెళ్లి బెదిరించినట్లు తెలిసింది.

**భయాందోళన సృష్టించిన గ్యాంగ్‌రేప్**

చిలమత్తూరు మండలం నల్లబొమ్మనపల్లిలో జరిగిన గ్యాంగ్ రేప్ రాష్ట్ర వ్యాప్తంగా కలకలం రేపింది. ఈ నెల 12న విజయదశమి పండుగ రోజున ఆర్ఎస్ పేపరు మిల్లు సమీపంలో అత్తా కోడలుపై ఆరుగురు యువకులు సామూహిక అత్యాచారం చేశారు. పండుగ రోజున సంబరంగా గడపాల్సిన కుటుంబంలో విషాదం నెలకొంది. జిల్లా వ్యాప్తంగా మహిళలు ఉలిక్కి పడ్డారు. కేసులో ఆరుగురిని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. కనీసం బాధితులతో మాట్లాడే అవకాశమూ ఎవరికీ ఇవ్వకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంది.

**చుట్టపుచూపుగా ఎమ్మెల్యే పర్యటన**

సినీనటుడు, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ చుట్టపుచూపుగా నియోజకవర్గానికి వస్తుంటారు. మూడు నెలలకో.. ఆర్నెల్లకో ఓసారి వచ్చి ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో పాల్గొని తిరుగు పయనం అవుతారు. గత మూడు పర్యాయాలుగా ఎమ్మెల్యే బాలకృష్ణ చేస్తున్నదిదే. నియోజకవర్గంలో జరిగే నేరాలు - ఘోరాలు గురించి ఆయన నోరు మెదపరు. తాజాగా ఎన్నికల ఫలితాల అనంతరం మూడుసార్లు మాత్రమే నియోజకవర్గంలో పర్యటించారు. తర్వాత ఆయన ఆచూకీ కనిపించలేదు.

**పీఏలదే రాజ్యం**

ఎమ్మెల్యే బాలకృష్ణ స్థానికంగా లేకపోవడంతో ఆయన పీఏ(వ్యక్తిగత సహాయకు)లు రాజ్యమేలుతున్నారు. అక్రమార్జనే ధ్యేయంగా అన్ని చోట్ల మామూళ్ల వసూలు చేస్తున్నారు. రోడ్డు పక్కన హోటల్ నుంచి మద్యం దుకాణం వరకు ఎవరినీ వదలడం లేదు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు, బంగారు దుకాణాలు, ఆస్పత్రులు, ఉద్యోగుల బదిలీల్లో పీఏలు చేతివాటం ప్రదర్శిస్తున్నారనే ఆరోపణలున్నాయి.

### సంచలనం రేపిన రంగనాథ్ కిడ్నాప్

జిల్లా కేంద్రం పుట్టపర్తిలో ఈ నెల 14న మద్యం షాపులకు లాటరీ తీశారు. లేపాక్షిలోని 57వ నంబర్ షాపు చిలమత్తూరుకు చెందిన రంగనాథ్‌కు దక్కింది. దీంతో అతన్ని బాలకృష్ణ అనుచరులు కిడ్నాప్ చేశారు. ఈ ఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారింది. ఆ తర్వాత రంగనాథ్.. కిడ్నాప్ చెర నుంచి బయటికి రావడం, ఆ తర్వాత పోలీసులను ఆశ్రయించడం తెలిసిందే. కాగా, నేటికీ రంగనాథ్‌కు అధికారులు లైసెన్స్ ఇవ్వలేదు.



లేపాక్షిలో మద్యం దుకాణ విజేత రంగనాథ్‌ను కిడ్నాప్ చేశారని కుటుంబ సభ్యుల నిరసన (ఫైల్)

# రాష్ట్రంలో మహిళలకు భద్రతేదీ?

- పెరిగిపోతున్న అత్యాచారాలు, హత్యలు
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్



మాట్లాడుతున్న ఉషశ్రీచరణ్

పరిగి: రాష్ట్ర వ్యాప్తంగా రోజూ మహిళలు, బాలికలపై హత్యలు, అత్యాచారాలు పెరిగిపోతున్నాయని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ ఆందోళన వ్యక్తం చేశారు. కూటమి పాలనలో మహిళలకు భద్రత కరువైందన్నారు. శాంతిభద్రతలు పూర్తిగా లోపించడం వల్లే ఇలాంటి దుశ్చర్యలు జరుగుతున్నాయన్నారు. ఆదివారం పరిగిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఇటీవల వైఎస్సార్ జిల్లా బద్వేలులో ప్రేమించలేదన్న అక్కసుతో బాలికపై యువకుడు పెట్రోలు పోసి నిప్పంటించి చంపేశాడన్నారు. ఈ ఘటనపై ప్రభుత్వానికి చీమ కుట్టినట్టు కూడా లేకపోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. వారం క్రితం హిందూపురం నియోజకవర్గంలో అత్తా కోడలిపై జరిగిన గ్యాంగ్ రేప్ ఘటనలో మరికొందరు నిందితులను గుర్తించినా అదుపులోకి తీసుకోకపోవడం అనుమానాలకు తావిస్తోందన్నారు. రాష్ట్ర హోం మంత్రిగా మహిళ ఉన్నప్పటికీ ఇలాంటి దుష్పరిణామాలు పెరిగిపోతుండటం, మహిళలకు రక్షణ కల్పించే చర్యలు చేపట్టకపోవడం ఆందోళన కలిగిస్తోందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో దిశ యాప్- పోలీస్ స్టేషన్ వల్ల మహిళలు, బాలికల భద్రతకు భరోసా కలిగిందని, వీటి కొనసాగింపుపై కూటమి ప్రభుత్వం పునరాలోచించాలని సూచించారు. విజయవాడ పరిధిలో వరద బాధితుల కోసం అగ్గిపెట్టెలు, కొవ్వొత్తుల ఖర్చులకు రూ.23 కోట్లు వెచ్చించామని ప్రభుత్వం చెప్పడం సిగ్గు చేటన్నారు.

**మద్యాంధ్రప్రదేశ్‌గా మార్చేశారు**

వైఎస్సార్‌సీపీ సర్కార్ మద్యపాన నిషేధానికి అడుగులు వేస్తే.. ప్రస్తుత కూటమి ప్రభుత్వం అందుకు విరుద్ధంగా మద్యాంధ్రప్రదేశ్‌గా మార్చేసిందని ఉషశ్రీచరణ్ ఎద్దేవా చేశారు. ప్రభుత్వ మద్యం దుకాణాలను మూయించి, అధికార పార్టీ నాయకులు, కార్యకర్తలకు, బడా బాబుల కోసం మద్యం దుకాణాలను ప్రైవేటీకరించడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. మద్యం మత్తులో కొందరు మహిళలపై దాడులకు తెగబడుతున్నారని ఆరోపించారు.

**బాలయ్యకు పరామర్శించే తీరికేదీ?**

తన నియోజకవర్గంలోని చిలమత్తూరు మండల పరిధిలో అత్తాకోడలిపై గ్యాంగ్ రేప్ జరిగితే.. ఇప్పటి వరకు బాధితులు, కుటుంబ సభ్యులను పరామర్శించే తీరిక కూడా ఎమ్మెల్యే బాలయ్యకు లేకపోయిందని ఉషశ్రీచరణ్ విమర్శించారు. ఓటు వేసిన ప్రజలను పట్టించుకోకుండా సొంత సంపాదన, షూటింగులకు పరిమితమై పోవడం విచారకరమన్నారు.

### సమస్యల పరిష్కారానికి చర్యలు

- రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్



ప్రజలతో మాట్లాడుతున్న మంత్రి కేశవ్

అనంతపురం టవర్‌క్లాక్: సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. ఆదివారం స్థానిక ఆర్ అండ్ బీ అతిథి గృహంలో ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ ప్రజల నుంచి అందిన అర్జీలకు త్వరితగతిన పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. మడకశిరలో నెలకొన్న పలు సమస్యలను ఎమ్మెల్యే ఎంఎస్ రాజు మంత్రి దృష్టికి తీసుకురాగా, వాటిని కూడా త్వరలో పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

### గ్రామాల సంపూర్ణ అభివృద్ధే ధ్యేయం



పండ్లతోటల పెంపకం ప్రారంభిస్తున్న మంత్రి సత్యకుమార్

తాడిమర్రి: గ్రామాల సంపూర్ణ అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ పేర్కొన్నారు. ఏకపాదంపల్లిలో ఎంపీడీఓ వెంకటరంగారావు అధ్యక్షతన ఆదివారం 'పల్లె పండుగ- పంచాయతీ వారోత్సవాలు' నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి మాట్లాడుతూ తాడిమర్రి మండలంలోని పలు గ్రామాల్లో రూ.3 కోట్లతో 75 సీసీ రోడ్లు నిర్మించనున్నట్లు, రూ.కోటి నిధులతో 45 మంది రైతులకు సంబంధించిన 100 ఎకరాల్లో చీనీ, మామిడి, దానిమ్మ తదితర పండ్లతోటల పెంపకం చేపట్టనున్నట్లు వెల్లడించారు. అలాగే గ్రామాల్లో తాగునీరు, పారిశుధ్యం, ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి చేపట్టినట్లు చెప్పారు. అంతకు ముందు ఆయన గ్రామంలో ఆదెమ్మ పొలంలో పండ్లతోటల పెంపకానికి, అలాగే రూ.30 లక్షలతో నిర్మించతలపెట్టిన సీసీ రోడ్డుకు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో డ్వామా పీడీ విజయప్రసాద్, ఆర్డీఓ మహేష్, ఏపీఓ సంజీవరెడ్డి, టీడీపీ నేత పరిటాల శ్రీరామ్, జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు నందిరెడ్డి శ్రీనివాసులు, ఏపీ సీడ్స్ డైరెక్టర్ కమతం కాటమయ్య, టీడీపీ మండల కన్వీనర్ రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

### పిడుగుపాటుకు పాడి రైతు మృతి



విగతజీవిగా పడిఉన్న లక్ష్మయ్య

హిందూపురం అర్బన్: పోచనపల్లి సమీపంలో పిడుగుపాటుకు పాడి రైతు మృతి చెందారు. ఈ ఘటనలో ఆవు కూడా మృత్యువాత పడింది. వివరాలిలా ఉన్నాయి. పోచనపల్లి సమీపాన పరదేశప్ప గుడి సమీపంలో లక్ష్మయ్య (65) ఆదివారం సాయంత్రం 6.30 గంటల సమయంలో ఆవు మేపుతుండగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. దీంతో సమీపంలోని వేప చెట్టు వద్దకు ఆవును తీసుకెళ్లి కట్టేసి.. అక్కడే అతనూ కూర్చున్నాడు. ఇదే సమయంలో చెట్టుపై పిడుగు పడటంతో కింద కూర్చున్న లక్ష్మయ్య ఆ ప్రభావినికి అక్కడికక్కడే ప్రాణం విడిచాడు. పక్కనే ఉన్న పాడి ఆవు కూడా మృతి చెందింది. పిడుగు పడే సమయానికి కొద్దిసేపు ముందే లక్ష్మయ్య భార్య సాకమ్మ ఇంటికి వెళ్లడంతో ప్రాణాపాయం తప్పింది. వీరికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.



మృతి చెందిన పాడి ఆవు

# దూసుకొచ్చిన మృత్యువు

- బైకును ఢీకొన్న ఆర్టీసీ బస్సు
- ఇద్దరి దుర్మరణం
- మరో మహిళకు తీవ్ర గాయాలు



మృతుడు లక్ష్మీరాం



చరణ్‌రాజ్, మనీషా దంపతులు (ఫైల్)

తాడిపత్రి/యాడికి: ఆర్టీసీ బస్సు బైకును ఢీకొన్న ఘటనలో ఇద్దరు దుర్మరణం పాలయ్యారు. మరో మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. తాడిపత్రి మండల పరిధిలోని చుక్కలూరు గ్రామ సమీపంలో ఆదివారం సాయంత్రం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. సీఐ శివ గంగాధర్ రెడ్డి తెలిపిన మేరకు.. నంద్యాల జిల్లా కోవెలకుంట్ల మండలం బీజీ వేముల గ్రామానికి చెందిన చరణ్ రాజ్ (30), మనీషా దంపతులు. వీరికి సంతానం లేదు. చరణ్ రాజ్ సోదరి సుమిత్రని యాడికి ఓం శాంతి కాలనీకి చెందిన రాముడుకు ఇచ్చి వివాహం చేశారు. ఈ దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. చరణ్‌రాజ్ దంపతులు రెండు సంవత్సరాలు క్రితం ఉపాధి నిమిత్తం యాడికి వచ్చి ఓం శాంతి కాలనీలోనే నివాసముంటున్నారు. రెండు కుటుంబాలూ మగ్గం నేస్తూ జీవనం సాగిస్తున్నాయి. బత్తలపల్లి మండలం ముద్దనపల్లిలోని తమ బంధువుల ఇంట్లో ఆదివారం పుట్టువెంట్రుకల కార్యక్రమానికి చరణ్‌రాజ్, రాముడు కుటుంబాలు వెళ్లాయి. వేడుక ముగిసిన అనంతరం చరణ్‌రాజు, మనీషా దంపతులు బైకుపై, రాముడు, మరి కొంత మంది కారులో స్వగ్రామం బయలుదేరారు. ఈ క్రమంలోనే రాముడు చిన్న కుమారుడు లక్ష్మీరాం (8) తన మేనమామ చరణ్‌రాజ్ బైకులో వస్తానంటూ మారాం చేయటంతో బాలుడిని అతను బైక్‌పై ఎక్కించుకుని ముందుకు కదిలాడు. మార్గమధ్యలో తాడిపత్రి మండలం చుక్కలూరు గ్రామ సమీపంలో బైకును గుత్తి నుంచి తాడిపత్రి వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. తీవ్రంగా గాయపడిన చరణ్‌రాజ్, బాలుడు లక్ష్మీరాం ఘటనాస్థలిలోనే ప్రాణాలు వదిలారు. తీవ్ర గాయాలైన మనీషాను స్థానికులు 108 వాహనంలో తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. ప్రమాద ధాటికి బాలుడు లక్ష్మీరాం ఒక చెయ్యి, కాలు తెగిపడ్డాయి. చరణ్‌రాజ్ కాలు కూడా తెగిపడటంతో ఆ ప్రాంతం భీతావహంగా మారింది. కాగా, ప్రమాద సమాచారం అందుకున్న రాముడు, సుమిత్ర దంపతులు ఘటనా స్థలానికి చేరుకుని గుండెలవిసేలా రోదించారు. ఘటనపై కేసు నమోదు చేసి మృతదేహాలను తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు సీఐ తెలిపారు.



### ఘనంగా సత్యసాయిబాబా అవతార ప్రకటన దినోత్సవం





సంగీత కచేరీ నిర్వహిస్తున్న సత్యసాయి మహిళా కళాశాల పూర్వ విద్యార్థులు, స్వర వాయిద్య కచేరీ

ప్రశాంతి నిలయం: భగవాన్ సత్యసాయి అవతార ప్రకటన దినోత్సవం ఆదివారం ప్రశాంతి నిలయంలో ఘనంగా జరిగింది. తొలుత సత్యసాయి మహాసమాధిని ప్రత్యేకంగా అలంకరించారు. సత్యసాయి 1940 అక్టోబర్ 20న తాను 'సాయిబాబా' అని ప్రకటించారు. ఆ నాటి నుంచి ఏటా అక్టోబర్ 20న సత్యసాయి అవతార ప్రకటన దినోత్సవంగా ప్రశాంతి నిలయంలో నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా ఆదివారం ఉదయం సత్యసాయి మహాసమధి చెంత ప్రత్యేక పూజలు చేశారు. యజుర్‌మందిరం నుంచి పూర్ణ కలశాలను, సత్యసాయి పాదుకలను, చిత్రపటాన్ని మహిళా కళాశాల పూర్వ విద్యార్థులు సాయి కుల్వంత్ సభా మందిరంలోని సత్యసాయి మహాసమాధి చెంతకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. సత్యసాయిని కీర్తిస్తూ సంగీత విభావరి నిర్వహించారు. సాయంత్రం సంగీత స్వర వాయిద్య కచేరి ఆకట్టుకుంది.

## క్లుప్తంగా

### నీట మునిగి వ్యక్తి మృతి


బయప్ప (ఫైల్)

కదిరి అర్బన్: ప్రమాదవశాత్తు నీట మునిగి ఓ వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు తెలిపిన మేరకు.. కదిరి మండలం ముత్యాలచెరువు గ్రామానికి చెందిన బయప్ప (57), మరి కొందరు అదే గ్రామ శివారులోని చెరువులో శనివారం సాయంత్రం చేపలు పట్టేందుకు వెళ్లారు. చీకటి పడుతుండడంతో బయప్ప తప్ప మిగిలిన వారందరూ ఇళ్లకు వెళ్లిపోయారు. ఆదివారం ఉదయానికి బయప్ప మృతదేహం నీటిలో తేలుతూ కనిపించింది. చేపలు పడుతూ లోతైన ప్రాంతానికి వెళ్లిన బయప్ప నీట మునిగి మృతి చెంది ఉంటాడనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఆయనకు భార్య అలివేలమ్మ, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

### వృద్ధుడి ఆత్మహత్య

తలుపుల: మండల కేంద్రంలోని ఎగువపేటకు చెందిన కె.శ్రీనివాసులు (63) ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... కొన్నేళ్లుగా కడుపునొప్పితో బాధపడుతున్న శ్రీనివాసులుకు కుటుంబ సభ్యులు చికిత్స చేయిస్తున్నారు. అయినా నయం కాలేదు. దీంతో జీవితంపై విరక్తి పెంచుకున్న ఆయన... శనివారం రాత్రి నొప్పి తీవ్రత భరించలేక క్రిమి సంహారక మందు తాగాడు. గమనించిన భార్య అనసూయ, కుమారుడు వెంటనే పులివెందులలోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం అనంతపురంలోని ఆస్పత్రికి రెఫర్ చేశారు. చికిత్సకు స్పందించక ఆదివారం ఆయన మృతిచెందాడు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ నరసింహుడు తెలిపారు.

### విద్యార్థిని బలవన్మరణం


మృతురాలు జయశ్రీ

పుట్లూరు: తరగతి గదిలో పాఠం అర్థం కాకపోవడంతో మనస్తాపం చెంది ఓ విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. కుటుంబసభ్యులు సమాచారం మేరకు... పుట్లూరు మండలం బాలాపురం గ్రామానికి చెందిన నారాయణస్వామి, సరశరాణి దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. వీరిలో పెద్ద కుమార్తె జయశ్రీ (16) అనంతపురంలోని శ్రీసాయి జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. దసరా సెలవులకు ఇంటికి వచ్చిన ఆమె... తనకు గణితం పాఠాలు అర్థం కావడం లేదని, ఇలాగే అయితే తాను ఇంటర్ ఉత్తీర్ణత సాధించడం కూడా కష్టమేనంటూ తల్లిదండ్రులతో చెప్పుకుని బాధపడింది. దీంతో తల్లిదండ్రులు సముదాయించారు. విషయాన్ని కళాశాల యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి ప్రత్యేక శ్రద్ధ తీసుకునేలా మాట్లాడతామని భరోసానిచ్చారు. అప్పటికే తీవ్ర మనోవేదనలో ఉన్న జయశ్రీ.... శనివారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆలస్యంగా ఇంటికి చేరుకున్న తల్లిదండ్రులు... ఉరికి విగతజీవిగా వేలాడుతున్న కుమార్తెను చూసి బోరున విలపించారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ హేమాద్రి అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

# కరాటే శిక్షణ... స్వీయ రక్షణ

- విద్యార్థినుల్లో ఆత్మస్థైర్యాన్ని పెంచుతున్న కరాటే
- యుద్ధ క్రీడలో రాణిస్తున్న కదిరి బాలికలు
- టోర్నీలో పాల్గొంటే పతకాలు గ్యారంటీ


కదిరి ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో కరాటే నేర్చుకుంటున్న విద్యార్థులు

కదిరి అర్బన్: ప్రస్తుత సమాజంలో రోజూ ఏదో ఒక ప్రాంతంలో బాలికలు, యువతులు, మహిళలపై అఘాయిత్యాలు జరుగుతున్నాయి. ఇలాంటి తరుణంలో తమ పిల్లలను చదువుల కోసం బయటికి పంపేందుకు తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. బాలికలకు చదువు ఒక్కటే సరిపోదు... వారు ఆపద సమయంలో తమను తాము రక్షించుకునేందుకు యుద్ధ క్రీడలు ఎంతో ఉపయోగపడుతున్నాయి. ఈ క్రమంలోనే కదిరి ప్రాంతానికి చెందిన పలువురు విద్యార్థినులు కరాటేలో రాణిస్తున్నారు.

**ప్రత్యేక శిక్షణలో రాటు దేలుతూ...**

కదిరిలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో విద్యార్థులకు ప్రత్యేకంగా కరాటే శిక్షణను మాస్టర్ షెక్షావలి అందిస్తున్నారు. ఈ శిక్షణలో పలువురు విద్యార్థినులు రాటు దేలుతున్నారు. వీరిలో నిఖితాబాయి, సిరి ప్రత్యేకంగా వివిధ టోర్నీల్లో పాల్గొని పతకాలను కైవసం చేసుకున్నారు. కదిరి పట్టణానికి చెందిన మూడే నిఖితాబాయి జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో పోటీల్లో రాణించింది. 2023లో ఒంగోలు జరిగిన కరాటే కుమ్మితే విభాగంలో మూడో స్థానాన్ని కైవసం చేసుకుంది. ఈ ఏడాది పార్వతీపురంలో జరిగిన పోటీల్లో 2వ స్థానాన్ని కైవసం చేసుకుంది. రాజంపేటలో నిర్వహించిన పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకాన్ని దక్కించుకుంది. ఫెన్సింగ్‌లోనూ నిఖితాబాయి తన ప్రత్యేకతను చాటుకుంటూ వస్తోంది. 2023లో ఎస్‌జీఎఫ్ జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో మూడో స్థానం, మార్షల్ ఆర్ట్స్ జాతీయ స్థాయిలో 2022లో జరిగిన పోటీల్లో పాల్గొని కంబాట్ విభాగంలో ప్రథమ స్థానం కైవసం చేసుకుంది. 2023లో ఫైట్ విభాగంలో 2వ స్థానం సాధించింది. 2023లో కంబాట్ విభాగంలో మూడో స్థానం, 2022 జూడో సబ్ జూనియర్స్ క్యాడెట్ ఏపీ స్టేట్ జూడో చాంపియన్‌షిప్ పోటీల్లో మూడో స్థానం సాధించింది. 2022 ఖేలో ఇండియా ఉమెన్స్ జూడో లీగ్ స్టేట్ టోర్నీలో రెండో స్థానం సాధించింది.

- మరో విద్యార్థిని సిరి కూడా 2023లో ఒంగోలులో జరిగిన కరాటే పోటీల్లో పాల్గొని కుమ్మితే విభాగంలో బంగారు పతకాన్ని దక్కించుకుంది. 2023–24లో పార్వతీపురం వేదికగా జరిగిన పోటీల్లో ప్రథమ స్థానం, రాజంపేటలో జరిగిన కుమ్మితే విభాగంలో ప్రథమ స్థానం, ఫెన్సింగ్ ఎస్‌జీఎఫ్ క్రీడల్లో రాష్ట్ర స్థాయిలో మూడో స్థానం, 2022, జూన్‌లో జరిగిన ఓవినం మార్షల్ ఆర్ట్స్ ఫైట్ విభాగంలో ప్రథమ స్థానం, 2023లోనూ ప్రథమ స్థానం సాధించింది.

### ఆత్మస్థైర్యం పెరిగింది



కరాటే నేర్చుకోక ముందు చాలా భయపడేదాన్ని. ఇప్పుడు నాలో ఆత్మస్థైర్యం పెరిగింది. ఏ విషయమైనా నిర్భయంగా మాట్లాడుగలుగుతున్నా. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో కరాటే మాస్టర్లను నియమించి విద్యార్థినులకు శిక్షణ ఇప్పించాలి. దీని వల్ల పాఠశాల స్థాయి నుంచే ఈవ్ టీజింగ్ లాంటివి అరికట్టవచ్చు.

– నిఖితాబాయి, ఇంటర్ విద్యార్థిని, కదిరి

### భయపడాల్సిన పని లేదు



పాఠశాల స్థాయి నుంచే యుద్ధవిద్యల్లో ప్రావీణ్యముంటే రౌడీ మూకల గురించి భయపడాల్సిన పనిలేదు. ప్రస్తుత సమాజంలో చదువుతో పాటు మార్షల్ ఆర్ట్స్ కూడా తప్పనిసరిగా చేర్చుకోవాలి. అనుకోని సంఘటనలు ఎదురైనపుడు స్వీయ రక్షణకు ఇవి ఎంతగానో ఉపయోగపడతాయి.

– సిరి, ఇంటర్ విద్యార్థిని, కదిరి

### పాఠశాలల్లో కరాటే మాస్టర్ పోస్టులుండాలి



అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో పీఈటీ, పీడీ పోస్టులతో పాటు కరాటే మాస్టర్లనూ నియమించాలి. కరాటే నేర్చుకునేందుకు పాఠశాలలో రోజూ ఒక పీరియడ్ కేటాయిస్తే చాలు. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెరిగినప్పుడే వారు ఏదైనా సాధించగలుగుతారు. ప్రస్తుత సమాజంలో విద్యార్థినులకు స్వీయ రక్షణకు ఉపయోగపడే యుద్ధక్రీడలు ఎంతో అవసరం.

– షెక్షావలి, కరాటే మాస్టర్, కదిరి

## భవన సముదాయాలు త్వరగా సమకూర్చుకోవాలి

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస్


కోర్టు సముదాయాన్ని పరిశీలిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస్

హిందూపురం టౌన్: హిందూపురంలో న్యాయస్థానాల నిర్వహణకు త్వరగా భవన సముదాయాలు సమకూర్చుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస్ సూచించారు. ప్రస్తుతం హిందూపురం న్యాయ సముదాయంలో ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి, అదనపు జూనియర్ సివిల్ జడ్జి, ప్రత్యేక న్యాయస్థానం భవన సముదాయాలు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. ఈ నేపథ్యంలో తాత్కాలికంగా ఇతర ప్రభుత్వ భవన సముదాయాల్లో ఆయా న్యాయస్థానాల నిర్వహణకు అందుబాటులో ఉన్న భవనాలను ఆదివారం జిల్లా జడ్జి, జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌తో కలిసి జిల్లా ప్రధాన న్యాయమూర్తి పరిశీలించారు. తొలుత డీజే, జాయింట్ కలెక్టర్, అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ, సీనియర్ సివిల్ జడ్జి శ్రీధర్, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి రాజ్యలక్ష్మి, అదనపు జూనియర్ సివిల్ జడ్జి లలితా లక్ష్మీ, సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ సుకుమార్ స్థానిక సబ్ కోర్టు ఆవరణలో న్యాయవాదులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ప్రస్తుతం కోర్టుల నిర్వహణకు అందుబాటులో ఉన్న భవన సముదాయాలపై న్యాయవాదులతో చర్చించారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న అదనపు జిల్లా కోర్టు, సబ్ కోర్టులకు సమీపంలోనే ఉన్న పశు వైద్యశాల భవన సముదాయం ఎంతో అనువుగా ఉంటుందని చెప్పడంతో.. ఆ భవన సముదాయాన్ని జిల్లా జడ్జి, జాయింట్ కలెక్టర్ పరిశీలించారు. దీనికి తోడు ప్రస్తుతం న్యాయస్థానాల నిర్వహణకు ఇబ్బందిగా ఉన్న ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి, అదనపు జూనియర్ సివిల్ జడ్జి భవన సముదాయాలను పరిశీలించారు. ఇప్పటికే కోర్టులు నిర్వహించుటకు స్వాధీనం చేసిన పాత రెవెన్యూ కార్యాలయాన్ని కూడా వారు సందర్శించారు. పశువైద్యశాలకు ఎదురుగా ఉన్న రైతు శిక్షణ కేంద్రం భవన సముదాయాన్ని కూడా పరిశీలించారు. అనంతరం న్యాయవాదులతో జరిగిన సమావేశంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు రాజశేఖర్, కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డిలు పలు సమస్యలను వివరించారు. బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జాయింట్ కలెక్టర్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు రామచంద్రారెడ్డి, రంగారెడ్డి, సుదర్శన్, సిద్దు, నాగరాజురెడ్డి, సదాశివరెడ్డి, ప్రసాద్ రెడ్డి, రవిచంద్ర, మురళి తదితరులు పాల్గొన్నారు.

## మధ్యంతర భృతిని వెంటనే ప్రకటించాలి

- ఏపీ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గణపతిరావు


మాట్లాడుతున్న గణపతిరావు

అనంతపురం ఎడ్యుకేషన్: ఉద్యోగ, ఉపాధ్యాయులకు మధ్యంతర భృతిని వెంటనే ప్రకటించాలని ఆంధ్రప్రదేశ్ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ (ఆప్టా) రాష్ట్ర అధ్యక్షుడు ఏజీఎస్ గణపతిరావు డిమాండ్ చేశారు. ఆదివారం అనంతపురంలోని ఉపాధ్యాయ భవన్‌లో 'ఆప్టా' రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన గణపతిరావు మాట్లాడుతూ.... జీఓ 117 రద్దు చేసి ప్రతి గ్రామ ప్రాథమిక పాఠశాలల్లోనూ 1 నుంచి 5 వరకు తరగతులు పునరుద్ధరణ చేయాలని డిమాండ్ చేశారు. మధ్యంతర భృతి ప్రకటించి 12వ పే రివిజన్ కమిషన్ నియమించాలని కోరారు. త్వరలో జరగబోయే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో డిగ్రీ అర్హత ఉన్న ఎస్జీటీలకూ ఓటు హక్కును కల్పించాలన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాకి ప్రకాష్‌రావు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు శాతం పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. టీచర్లకు యాప్‌ల భారం తగ్గించాలన్నారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు మహడి మాట్లాడుతూ సీపీఎస్, జీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి ఆర్.మురళీమోహన్ మాట్లాడుతూ ఎంటీఎస్ టీచర్ల సర్వీస్‌ను క్రమబద్ధీకరించాలన్నారు. పీటీఐలకు మినిమం టైం స్కేల్ ఇవ్వాలన్నారు. జిల్లా అధ్యక్షప్రధానకార్యదర్శులు సి.గోపాల్‌రెడ్డి, కె.వెంకటరత్నం మాట్లాడుతూ గతంలో ఉన్న విద్యార్థి ఉపాధ్యాయ నిష్పత్తిని విద్యా హక్కు చట్టం ప్రకారం నిర్ణయించాలన్నారు. 12 ఏళ్ల సర్వీసు పూర్తి చేసిన ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్ కేడర్‌గా పరిగణించాలని డిమాండ్ చేశారు. అనంతరం పలు తీర్మానాలను ఆమోదించారు. సమావేశంలో ఆప్టా కర్నూలు జిల్లా అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి, నాయకులు శంకరమూర్తి, ప్రభాకర్‌రెడ్డి, నారాయణ, కుళ్లాయప్ప, సూర్యనారాయణ, నరేష్, వలి, సుంకన్న లింగన్న పాల్గొన్నారు.

## లేదాళ్లకు పురస్కార ప్రదానం


విమలా శాంతి సాహితీ పురస్కారం అందుకుంటున్న లేదాళ్ల రాజేశ్వరరావు

అనంతపురం కల్చరల్: ఆధునిక సాహిత్యానికి పట్టుగొమ్మగా రాయలసీమ విరాజిల్లుతోందని పలువురు వక్తలన్నారు. వైఎస్సార్ జీవిత సాఫల్య పురస్కార గ్రహీత డాక్టర్ శాంతినారాయణ ప్రతిష్టాత్మకంగా అందిస్తున్న విమలా స్మారక సాహితీ పురస్కారాన్ని ఈ ఏడాదికి గాను తెలంగాణ కవి లేదాళ్ల రాజేశ్వరరావుకు అందించారు. ఆదివారం స్థానిక ఎస్జీఓ హోమ్‌లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ఆచార్య రాచపాలెం చంద్రశేఖరరెడ్డి అధ్యక్షత వహించారు. డాక్టర్ శాంతినారాయణ, ముఖ్య అతిథిగా విచ్చేసిన నాగార్జున యూనివర్సిటీ ప్రిన్సిపాల్ ఆచార్య చల్లపల్లి స్వరూపరాణి, రాజారాం, డాక్టర్ అంకె శ్రీనివాస్, సడ్లపల్లి చిదంబరరెడ్డి, కొత్తపల్లి సురేష్ తదితరులు ప్రసంగించారు. రాయలసీమ జిల్లాల నుంచి ఎంతో మంది ఉద్దండులైన రచయితలు గొప్ప సాహిత్యాన్ని అందిస్తున్నారని పురస్కార గ్రహీత రాజేశ్వరరావు కొనియాడారు. చాలా ప్రాంతాల వారికి అనంత సాహిత్యం ఎంతో స్ఫూర్తిదాయకంగా నిలుస్తోందన్నారు. ప్రజాగాయకుడు దాసరి ఆదినారాయణ, రచయితలు మారుతి, నబీరసూల్ తదితరులు పాల్గొన్నారు.

### ఆశ్రమానికి అనాథ మహిళ తరలింపు

రాయదుర్గం టౌన్: స్థానిక 21వ వార్డు మారెమ్మగుడి వద్ద ఒంటరిగా ఉంటున్న మతి స్థిమితం లేని అనాథ మహిళను స్వచ్ఛంద సంస్థల సహకారంతో నార్పల మండలం కురగానపల్లి చెన్నకేశవ అనాథ వృద్ధాశ్రమానికి ఆదివారం తరలించారు. ఊరు, పేరు తెలియని ఆ మహిళ బాగోగులను చాలా రోజులుగా కాలనీవాసులే చూసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న ఛేంజ్ ఫర్ సొసైటీ ఆర్గనైజేషన్ సభ్యులు దాతల సహకారంతో అనాథాశ్రమానికి పంపించారు. కార్యక్రమంలో జబీవుల్లా, పార్వతి, నాదెల్, పార్వతి, మంజునాథ్, కాలనీవాసులు పాల్గొన్నారు.

### దాయాదుల మధ్య గొడవ

విడపనకల్లు: మండలంలోని పాలికి గ్రామంలో పైపులైన్‌ను ధ్వంసం చేశారని దాయాదుల మధ్య ఆదివారం ఘర్షణ జరిగింది. గ్రామానికి చెందిన కుమ్మరి ఓబులేసు, హేమంత్, నాగలక్ష్మి, కల్మేరి నాగభూషణం, ఆంజనేయులు, లక్ష్మి దాయాదులు. కొన్నేళ్లుగా ఓబులేసు, హేమంత్, నాగలక్ష్మి పొలం నుంచి నాగభూషణ, ఆంజనేయులు, లక్ష్మి పొలాలకు పైపులైన్ వేసుకుని వంక నీరు పారించుకునేవారు. ఇటీవల వీరి మధ్య మనస్పర్థలు తలెత్తాయి. గ్రామంలోని పెద్ద మనుషులు రాజీ చేశారు. అయితే ఓబులేసు, హేమంత్, నాగలక్ష్మి ఆదివారం కుమ్మరి నాగభూషణ, ఆంజినేయులు, లక్ష్మి పొలాలకు ఏర్పాటు చేసిన పైపులైన్‌ను పగులగొట్టారు. దీంతో ఇరు వర్గాల మధ్య గొడవ చెలరేగి పరస్పరం రాళ్లతో దాడి చేసుకున్నారు. కుమ్మరి నాగభూషణ, ఆంజనేయులు, లక్ష్మి తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఉరవకొండ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్నారు. నాగభూషణ పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సలహా మేరకు అనంతపురం ఆస్పత్రికి తరలించారు. ఘటనపై స్థానిక పోలీసులకు నాగభూషణ, ఆంజనేయులు, లక్ష్మి ఫిర్యాదు చేశారు.

## ప్రమాదం కాదు.. హత్యే!

- బొమ్మన్న మృతి కేసులో వీడిన మిస్టరీ
- హత్య చేసి రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించిన కన్న కొడుకు


బొమ్మన్న(ఫైల్)

రాయదుర్గం టౌన్: స్థానిక సిద్ధేశ్వర కాలనీలో నివాసముంటున్న బొమ్మన్న మృతి కేసులో మిస్టరీని పోలీసులు ఛేదించారు. కన్న కొడుకే హత్య చేసి రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించినట్లు నిర్ధారించారు. వివాలను సీఐ జయానాయక్ ఆదివారం వెల్లడించారు. తాగునీటి పథకానికి సంబంధించి వాటర్ ట్యాంక్ నిర్వహణతో పాటు, పొలం పనులతో జీవనం సాగిస్తున్న బొమ్మన్నకు భార్య శివమ్మ, ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. పెద్ద కుమారుడు నాగరాజు వ్యసనాలకు బానిసై తరచూ వేధిస్తుండడంతో ఆయన భార్య పుట్టింటికి వెళ్లింది. ఈ క్రమంలోనే డబ్బు కోసం తండ్రితో గొడవ పడేవాడు. నాగరాజు ఆగడాలు శ్రుతి మించడంతో తండ్రి తీవ్రంగా మందలించాడు. దీంతో కక్ష పెంచుకున్న నాగరాజు శనివారం సాయంత్రం పొలం పనులు ముగించుకుని వస్తున్న తండ్రిని మల్లాపురం తండా సమీపంలో అడ్డుకుని గొడవపడ్డాడు. ముందుగానే సిద్ధంగా ఉంచుకున్న కొడవలితో నరికాడు. ఆ సమయంలో అక్కడే ఉన్న సమీప బంధువు సురేష్ వారించిబోయినా వినలేదు. తీవ్ర గాయాలతో రక్తపు మడుగులో కొట్టుమిట్టాడుతున్న తండ్రిని చూస్తూ ఈ విషయాన్ని ఎవరితోనైనా చెబితే హతమారుస్తానంటూ సురేష్‌నూ బెదిరించాడు. అనంతరం బొమ్మన్న (45) మృతదస్తమాన్ని ఆటోలో స్థానిక ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లాడు. ద్విచక్ర వాహనం అదుపుతప్పి కిందపడి మృతిచెందినట్లుగా అందరినీ నమ్మించాడు. దీంతో తొలుత ప్రమాదంలో మృతి చెందినట్లుగానే పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. అయితే తన తండ్రిని హతమార్చబోతున్నట్లు చెల్లెలుకు నాగరాజు వీడియో కాల్ చేసి తెలిపిన విషయం బయటపడింది. ఇదే సమయంలో సురేష్ కూడా జరిగిన ఘటనను కుటుంబసభ్యులకు వివరించాడు. దీంతో శనివారం రాత్రే ఆస్పత్రి నుంచి నాగరాజు పరారయ్యాడు. హతుడు బొమ్మన్న భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు హత్య కేసు నమోదు చేసి, పరారీలో ఉన్న నాగరాజు కోసం గాలిస్తున్నారు.

## గొంతు నులిమి మహిళ దారుణహత్య

- 'అనంత'లో దారుణం


హత్యకు గురైన నాగమ్మ


ఘటనాస్థలి వద్ద స్థానికులతో మాట్లాడుతున్న అనంతపురం జిల్లా ఎస్పీ జగదీష్

అనంతపురం: నగరంలో ఓ మహిళ దారుణ హత్యకు గురైంది. త్రీ టౌన్ సీఐ శాంతిలాల్ తెలిపిన మేరకు.. కళ్యాణదుర్గం మండలం ఉప్పొంకకు చెందిన నాగమ్మ, నాగప్ప దంపతులు. వీరికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు సంతానం. కొంత కాలం క్రితం భర్తతో నాగమ్మ విడిపోయారు. అనంతపురంలోని ఎర్రనేలకొట్టాలకు వచ్చి ఓ భవనంలోని పై పోర్షన్‌ను అద్దెకు తీసుకుని ఉంటున్నారు. స్థానికంగా ఓ హోటల్‌లో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఆదివారం ఉదయం 9 గంటలైనా పనికి రాకపోవడంతో నాగమ్మకు హోటల్ యజమాని ఫోన్ చేశాడు. ఎన్ని సార్లు కాల్ చేసినా లిఫ్ట్ చేయకపోవడంతో నాగమ్మ కింది పోర్షన్‌లో ఉంటున్న వారికి సమాచారం అందించారు. ఈ క్రమంలోనే వారు వెళ్లి చూడగా మంచంపై విగతజీవిగా ఆమె కనిపించారు. సమాచారం అందుకున్న త్రీటౌన్ పోలీసులు హుటాహుటిన అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతదేహం చుట్టూ కారం పొడి చల్లినట్లు గుర్తించారు. పోలీసు జాగిలాల నుంచి తప్పించుకునే ఉద్దేశంతోనే ఇలా చేశారని, దీన్ని బట్టి నేరాల్లో ఆరితేరిన వారే ఘాతుకానికి పాల్పడి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. శనివారం రాత్రే నాగమ్మను హత్య చేసినట్లు పోస్టుమార్టంలో తేలింది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, మృతురాలి వద్ద బంగారును కాజేసే ఉద్దేశంతోనే హత్య చేసినట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. హత్యకు పాల్పడిన వారు పోలీసుల అదుపులో ఉన్నట్లు విశ్వసనీయంగా తెలిసింది.

**ఘటనాస్థలాన్ని పరిశీలించిన ఎస్పీ..**

హత్య విషయం తెలిసిన వెంటనే అనంతపురం జిల్లా ఎస్పీ పి. జగదీష్ సంఘటనా స్థలానికి చేరుకున్నారు. డీఎస్పీ నేతృత్వంలో విచారణకు ఆదేశించారు. డాగ్‌స్క్వాడ్, క్లూస్‌టీంలను అప్రమత్తం చేశారు. ఎస్పీ వెంట అనంతపురం అర్బన్ డీఎస్పీ వల్లూరు శ్రీనివాసరావు, సీఐలు ఉన్నారు.

### నేటి నుంచి టీచర్లకు ఎఫ్ఎల్ఎన్ శిక్షణ

కదిరి: ప్రభుత్వ బడుల్లో 1, 2వ తరగతులు బోధించే టీచర్లకు హిందూపురం సమీపంలోని బిట్ కళాశాలలో ఈ నెల 21 నుండి 6 రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నారు. ఫౌండేషన్ లిటరసీ న్యూమరసీ పేరుతో తలపెట్టిన ఈ కార్యక్రమానికి జిల్లాతో పాటు నంద్యాల జిల్లాకు చెందిన 250 మంది ఉపాధ్యాయులు హాజరు కానున్నారు. ప్రభుత్వ బడుల్లో 1, 2వ తరగతుల్లో చదివే ప్రతి విద్యార్థికి చదవడం, రాయడంతో పాటు గణితంలో ప్రాథమిక నైపుణ్యాలు, జ్ఞానాన్ని పెంపొందించడంపై ఎలా బోధించాలి అనే అంశంపై శిక్షణ ఉంటుంది. ఆరు రోజుల పాటు బిట్ కళాశాలలోనే బసతో పాటు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజన సదుపాయాలు కల్పించారు. శిక్షణ ముగిసిన అనంతరం మరో 14 రోజుల పాటు వీరికి ఆన్‌లైన్ ద్వారా శిక్షణ కొనసాగుతుంది. ఏకోపాధ్యాయ పాఠశాలల టీచర్లకు ప్రస్తుతానికి మినహాయింపునిచ్చారు. బడి మూతపడకుండా వీరికి శిక్షణ ఎలా ఇవ్వాలనే దానిపై ప్రభుత్వం త్వరలోనే సరైన నిర్ణయం తీసుకోనుందని డీఈఓ మీనాక్షి తెలిపారు.

### నారాయణ, శ్రీచైతన్య పాఠశాలలకు షోకాజ్ నోటీసులు


నారాయణ పాఠశాలలో తరగతులను బంద్ చేయిస్తున్న ఎంఈఓ గంగప్ప

హిందూపురం టౌన్: ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించి సెలవు రోజుల్లో తరగతులు నిర్వహిస్తున్న నారాయణ, శ్రీచైతన్య పాఠశాలల యాజమాన్యాలకు షోకాజ్ నోటీసులు జారీ అయ్యాయి. ఈ మేరకు హిందూపురం ఎంఈఓ గంగప్ప తెలిపారు. ఆదివారం సెలవు రోజు ఉన్నా... స్థానిక పాండురంగనగర్ సమీపంలోని నారాయణ ఒలంపియాడ్ పాఠశాల, బెంగళూరు రోడ్డులోని శ్రీ చైతన్య పాఠశాలల్లో తరగతులు నిర్వహిస్తుండడంతో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బాబావలి ఫిర్యాదు మేరకు ఎంఈఓ తనిఖీలు చేపట్టారు. తరగతుల నిర్వహణను అడ్డుకున్నారు. నిబంధనల అతిక్రమణపై షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

### వైభవంగా సత్యసాయి రథోత్సవం


రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఉరవకొండ: సమాజంలో ప్రేమ తత్వాన్ని చాటిన సత్యసాయిబాబా అవతార ప్రకటన రోజు సందర్భంగా ఆదివారం ఉరవకొండలో రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. సత్యసాయి భక్తులు, భజన మండలి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సత్యసాయి చిత్రపటాన్ని ప్రత్యేక వాహనంలో ఉంచి పుష్పాలతో అలంకరించి భజనలు, మేళతాళాలతో పురవీధుల్లో ఊరేగించారు. వస్త్రదానం, అన్నదానం కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టారు. కార్యక్రమంలో సత్యసాయి సంస్థల జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రామచంద్ర, ఆధ్యాత్మిక విభాగం కో–ఆర్డినేటర్ డాక్టర్ శైలజ, సేవా విభాగం కన్వీనర్ అనురాధ, అనంతపురం సమితి కన్వీనర్ నరసింహప్ప, ఉరవకొండ సమితి కన్వీనర్ దాసెట్టి రామాంజినేయులు, సత్యసాయి భక్తులు తదితరులు పాల్గొన్నారు.

### పప్పుశనగ సాగుకు మంచి సమయం


పప్పుశనగ పంట

అనంతపురం అగ్రికల్చర్: రబీలో ప్రధానపంటగా నల్లరేగడి భూముల్లో పప్పుశనగ విత్తుకునేందుకు ఇదే మంచి సమయమని రేకులకుంట వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం.విజయశంకరబాబు, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ జి.నారాయణస్వామి తెలిపారు. నవంబర్ 15వ తేదీ వరకూ సాగు చేసుకోవచ్చన్నారు. ఇటీవల జిల్లా వ్యాప్తంగా మంచి వర్షాలు కురిసినందున నల్లరేగడి భూముల్లో పంట సాగు చేసుకోవాలని తెలిపారు. నంద్యాల గ్రామ్–1267, నంద్యాల గ్రామ్–776, నంద్యాల గ్రామ్–857, నంద్యాల గ్రామ్–452, నంద్యాల గ్రామ్–49, ధీర (ఎన్‌బీఈజీ–47), నంద్యాల సంగా, జేజీ–11, జాకీ–9218 లాంటి విత్తన రకాలు ఎంపిక చేసుకోవాలన్నారు. ఎకరాకు 30 నుంచి 35 కిలోలు విత్తనం సరిపోతుందన్నారు. విత్తుకునే ముందు కిలో విత్తనానికి 8 గ్రాములు ట్రైకోడెర్మావిరిడీ, అలాగే 3 గ్రాములు థైరామ్ లేదా 2.5 గ్రాములు కార్బండిజమ్‌తో తప్పనిసరిగా విత్తనశుద్ధి చేసుకుంటే విత్తనం ద్వారా వ్యాపించే రోగాలను చాలా వరకు నివారించవచ్చని తెలిపారు. కలుపు నివారణకు ఎకరాకు పెండిమిథాలీన్ 1000 నుంచి 1,400 మి.లీ కలుపు మందు 200 లీటర్ల నీటికి కలిపి విత్తిన 24 నుంచి 48 గంటల్లోపు పిచికారీ చేసుకోవాలని తెలిపారు. నల్లరేగడి భూములు కలిగిన 22 నుంచి 25 మండలాల పరిధిలో ఈ సారి 75 వేల నుంచి 80 వేల హెక్టార్ల విస్తీర్ణంలో పప్పుశనగ పంట సాగులోకి రావచ్చని అధికారులు అంచనా వేశారు. తాడిపత్రి, ఉరవకొండ, రాయదుర్గం డివిజన్ల పరిధిలో సాగుకు రైతులు సిద్ధంగా ఉన్నారు. అందుకు తగ్గట్లు సకాలంలో వర్షాలు పడటంతో రబీ ఏరువాక జోరుగా సాగనుందని చెబుతున్నారు.